JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I ఆదివారం 22-03-2026
Medchal - Malkajgiri I Sunday 22-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 I సంచిక : 294
పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 294 I Pages : 8 I ₹: 5



2 లో



# రేవంత్ వ్యూహాల ముందు.. కేటీఆర్ ఆత్మరక్షణ

- ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు
- రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి
- రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమే

**జయభేరి, హైదరాబాద్, మార్చి 21 :**

తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు. ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం ...మిగతాది 2 లో

# ఆలయ అభివృద్ధికి శ్రీకారం



**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ సహజత్వానికి ఏమాత్రం భంగం కలగకుండా అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్రానుసారం చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనుల నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి, అందుకు సంబంధించిన అంచనాలతో తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని పుష్కర ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి పనులు జరగాలని చెప్పారు. 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరగాలని సూచించారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు కూడా ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



2 లో

# కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ సూసైడ్

- ఐదు రోజుల క్రితమే భార్య ఆత్మహత్య
- ఆమె లేని లోటును భరించలేక ఓ బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి ఆత్మహత్య



## జీవన్ రెడ్డి నివాసంలో 'బ్రేక్ ఫాస్ట్' రాజకీయం
# బుజ్జగింపులు ఫలించేనా?

- రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం
- కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు.. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- ప్రాధాన్యం లేనప్పుడు పార్టీలో ఉండటం ఎందుకు : జీవన్ రెడ్డి
- జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్

**జయభేరి, కరీంనగర్, మార్చి 21 :**

దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు ...మిగతాది 2 లో

# పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు

- సానుకూలంగా ప్రభుత్వం!

**జయభేరి, విజయవాడ, మార్చి 21 :**

ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. వీరి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో ...మిగతాది 2 లో





# సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి

- సజ్జనార్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 21:**

స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ...మిగతాది 2 లో



# టీజేపీకి లైన్ క్లియర్

- 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు
- జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత

**జయభేరి, హైదరాబాద్, మార్చి 21:**

తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇప్పుడు సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నమోదు ప్రక్రియను కవిత ప్రారంభించారు. సాధారణంగా రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో సాగుతుంది. అయితే, తన దరఖాస్తుపై ఈసీఐ వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత. ఫిబ్రవరి 23న దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఈసీఐ తిరుగు టపా పంపింది. మార్చి 19న ఢిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్‌పై కీలక విచారణ జరగనుంది. ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేటీఆర్ ఆత్మరక్షణ

భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్ 2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేకపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరపున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది. రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమేనని స్పష్టమవుతోంది.

## రిటైర్మెంట్ వయసు 62కి పెంపు

కూడిన కమిటీ ఇప్పటికే సమావేశమైంది. పదవీ విరమణ వయసు పెంపునకు ఈ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## సోషల్ మీడియా పరిచయాలు..

'ఎక్స్' వేదికగా హెచ్చరించారు."ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయ మాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు.ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారుఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు.తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు.ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## బుజ్జగింపులు ఫలించేనా?

మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈ ఉదయం ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపును కూడా తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మంత్రుల బుజ్జగింపులు తగ్గని జీవన్ రెడ్డి.. జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనతో గంటల తరబడి చర్చలు జరిపారు. పార్టీలో మీ ప్రాధాన్యత తగ్గదు, తగిన గుర్తింపు ఇస్తాం అని మంత్రులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన మనసు మార్చుకోలేదని తెలుస్తోంది. తన సొంత కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రుల వద్ద కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీ నిష్ఫలమైందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జీవన్ రెడ్డిపై కన్నేశాయి. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారని, 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి సీనియారిటీని గౌరవించి, ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. బీజేపీ కూడా ఆయన వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో జీవన్ రెడ్డికి ఉన్న పట్టును గమనించి, ఆయనను తమ వైపు తిప్పుకుంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగుండదని కమలనాథులు భావిస్తున్నారు. మొత్తానికి జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు" అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కినట్లు సమాచారం. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించడం లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ పార్టీని వీడాలని ఆయన ఇప్పటికే తన నిర్ణయాన్ని తీసేసుకున్నారని తెలుస్తోంది.ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఉగాది తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పిన ఆయన, బీఆర్ఎస్ వైపు వెళ్తారా? లేక స్వతంత్రంగా ఉంటారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

# తెలుగు రాష్ట్రాల మధ్య ఫిలిం అవార్డ్స్



ఉగాది నాడు... తెలంగాణ చిత్ర పరిశ్రమ అవార్డుల వేడుక 'గద్దర్ అవార్డ్స్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సీఎం, డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన ఈ వేడుకకు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరథులంతా వచ్చారు. 2025 సంవత్సరం ఉత్తమ చిత్రాలు, నటుల అవార్డులతో పాటు మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డ్ ప్రదానం చేశారు.ఈ అవార్డుల ప్రదానోత్సంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. సందర్భమో.. అసందర్భమో తెలీదంటూనే ఆయన చేసిన వ్యాఖ్యలు కాస్త కాక రేపాయి. " తెలంగాణలో చిత్ర పరిశ్రమను బాగా గుర్తిస్తున్నారు.. పక్క రాష్ట్రమైనటువంటి మరో తెలుగురాష్ట్రం కళాకారుల పట్ల, సినిమాల పట్ల వారిని ఉత్సాహ పరిచే విధానంలో కొంచం వెనుకంజలో ఉందని భావిస్తున్నాను. సినిమా వాళ్లకి దగ్గరగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారు దీనిని ఇన్స్పిరేషన్ గా తీసుకుని మరింత ప్రోత్సహిస్తే కనుక బాగుంటుంది." అంటున్నారు. దీనిపై వెంటనే రియాక్షన్ వచ్చింది.

చిరంజీవి స్థాయి వ్యక్తి.. పక్క రాష్ట్రంలో అవార్డుల ఇస్తున్న వేదికపై మాట్లాడటంతో అంతా దీని గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. చిరంజీవి వ్యాఖ్యలే ఏపీకి కొంచం ఇబ్బందికరంగా మారితే.. మరో నటుడు ఆర్.నారాయణమూర్తి "చంద్రబాబు గారూ..తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఉనికిని గుర్తించండి.. మీరు కూడా నంది అవార్డులు ఇవ్వండి" అంటూ ఆవేశంగా మాట్లాడారు. ఇద్దరు ముఖ్యమైన నేతలు ఓ రాష్ట్రంలోని అవార్డుల వేదికపై నుంచి మరో రాష్ట్రం గురించి మాట్లాడటం ఆంధ్రప్రదేశ్‌ను ఇరుకున పెట్టినట్లైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కొంచం ప్రో యాక్టివ్‌గానే ఉండే వ్యక్తి. ఆయనకు సినిమా వాళ్లతో ఉన్న సన్నిహిత సంబంధాలు కూడా అందరికీ తెలిసిందే. ఇప్పుడు చిరంజీవి బహిరంగంగా ఇలాంటి కామెంట్ చేయడంతో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ స్పందిస్తుందా లేదా అన్నది చూడాలి. చంద్రబాబు నేరుగా రియాక్ట్ కాకపోయినా ఆ శాఖ నుంచి స్పందన వస్తుందేమో అని సినిమా ఇండస్ట్రీ చూస్తోంది. తెలుగు సినిమా రంగంలో స్టార్ హీరోగా ఉన్న పవన్ కల్యాణ్ ఏపీలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు వ్యాఖ్యలు చేసిన మెగాస్టార్‌కు ఆయన సోదరుడే. అప్పట్లో ఇండస్ట్రీ విషయంలో ఉన్న గ్యాప్‌ను సరిచేయడానికి పవన్ కల్యాణ్ కూడా ప్రయత్నాలు చేశారు. చిరంజీవి వ్యాఖ్యలపై ఎవరూ అధికారికంగా రెస్పాండ్ అవ్వకపోయినా .. తెలుగుదేశంకు అనుకూలంగా ఉండే సోషల్ మీడియా అకౌంట్లలో చిరంజీవి వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం అవుతోంది. వాళ్లు లేవనెత్తుతున్న పాయింట్లు ఏంటంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందినటువంటి చిరంజీవి పక్క రాష్ట్రం అంటూ కామెంట్లు చేయడం ఏంటి.. ఆయన ఆంధ్రా వ్యక్తి కాదా అన్న ప్రశ్న వస్తోంది. ఒక రాష్ట్రానికి చెందిన అవార్డుల కార్యక్రమంలో వేరే రాష్ట్రాన్ని బహిరంగంగా అదే వేదికపై పాయింట్ అవుట్ చేయడం సభా మర్యాదేనా..?

చిరంజీవి కేవలం నటుడే కాదు. ఆయనకు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఏపీ ఇండస్ట్రీ అభివృద్ధికి చిరంజీవి ఏమైనా కృషి చేశారా.. లేదా తన ఫౌండేషన్ ద్వారా ఏమైనా కార్యక్రమాలు చేశారా అని ప్రశ్నిస్తున్నారు. వైజాగ్‌లో స్టూడియో ఏర్పాటు చేయడం తన డ్రీమ్ అని చిరంజీవి ప్రకటించారు. మరి దానికోసం ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా..? ఆయనకు ఏపీ ప్రభుత్వం ఏమైనా సహకరించడం లేదా..?తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే అది హైదరాబాద్ కే సంబంధించినదిగా ఇండస్ట్రీ పెద్దలు వ్యవహరిస్తున్నారు. వాళ్లు ఆంధ్రాలో కనీసం సినిమా కార్యక్రమమైనా చేస్తున్నారా అని నిలదీశారు. కిందటి ప్రభుత్వం లాగా ఏపీలో సినిమా టికెట్ల రేట్లు పెంపు విషయంలో ఎలాంటి అభ్యంతరాలు పెట్టలేదు. ఇండస్ట్రీ నుంచి అడిగిన వెంటనే అన్ని సినిమాలకు రేట్లు పెంచతూ జీవోలు వచ్చాయి. తెలంగాణలో కొన్ని సినిమాలకు టికెట్లు రేట్లు పెంచకుండా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా సరే తెలంగాణతో సమానంగా ఇండస్ట్రీకి మేలు చేయడంలో ఏపీ వెనుకబడిందని చిరంజీవి వ్యాఖ్యానించడాన్ని వాళ్లు తప్పు పడుతున్నారు. సినిమా ఇండస్ట్రీ వాళ్లపై ఆగ్రహానికి మరో కారణం.. ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా ఇండస్ట్రీ నుంచి అధికారికంగా ఎవరూ ఇంతవరకూ సీఎం ను కలవలేదు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఓసారి మీటింగ్‌కు ప్రయత్నించారు.

అప్పట్లో కొంతమంది పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఆ తర్వాత సీఎంతో మీటింగ్‌కు కిందటేడాది జూన్‌లో ప్రయత్నాలు జరిగాయి. అయితే హైదరాబాద్‌లో వీరిని కలిసేవిధంగా ఓ ఆదివారం చంద్రబాబు టైమ్ ఇచ్చారు. కానీ కొంతమంది షూటింగ్‌లు ఉన్నాయని రాలేకపోవడంతో ఆ మీటింగ్ జరగలేదు. ఈ విషయాన్ని తెలంగాణ FDC ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు స్వయంగా చెప్పారు. ఇప్పుడు టీడీపీ అనుకూల సోషల్ మీడియా ఆ వీడియోలను వైరల్ చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2016 లో మూడేళ్లకు నంది అవార్డులు ప్రకటించారు. అయితే ఈ అవార్డుల ఎంపికపై విమర్శలు చెలరేగాయి.

అవార్డుల ఎంపిక సక్రమంగా లేదంటూ అప్పటి వైఎస్సార్సీపీ నేత, నటుడు పోసాని కృష్ణమురళి వంటి వారు బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. అవార్డుల ప్రకటన అయితే జరిగింది కానీ.. వాటిని నేరుగా నటులకు అందజేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో సాధారణంగా ప్రతీ ఏడాది ఉగాది నాడు నంది అవార్డులను ప్రదానం జరుగుతుంది. ఒకవేళ ఓ సంవత్సరం ఇవ్వకపోయినా రెండు మూడేళ్లకు ఓసారి అయినా ఇచ్చేవాళ్లు.. కానీ ఇంతవరకూ ఏపీ విభజన తర్వాత ఒక్కసారి కూడా నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. కారణాలు ఏవైనా కానీ.. ఏపీలో కార్యక్రమం జరగకపోవడం ఓ లోటే. ఈ గ్యాప్‌ను సరిదిద్దడానికి ప్రయత్నాలు జరగాలి.



## కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ సూసైడ్

- ఐదు రోజుల క్రితమే భార్య ఆత్మహత్య
- ఆమె లేని లోటును భరించలేక ఓ బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి ఆత్మహత్య

**జయభేరి, కరీంనగర్, మార్చి 21 :**

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. జమ్మికుంట మండలం సీతంపేటలోని అత్తారింటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య దివ్య ఐదు రోజుల క్రితమే సూసైడ్ చేసుకుంది. ఇంతలో ఆయన కూడా ఇలా చనిపోవడం అందర్నీ షాక్‌కి గురి చేసింది. ఒకే కుటుంబంలో కొద్ది రోజుల వ్యవధిలోనే జరిగిన రెండు వరుస మరణాలు కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపాయి. ప్రాణ సమానంగా ప్రేమించిన భార్య అకాల మరణాన్ని తట్టుకోలేక, ఆమె లేని లోటును భరించలేక ఓ బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య చనిపోయిన ఐదు రోజులకే ఆయన కూడా అదే బాట పట్టడం స్థానికంగా అందర్నీ కలిచివేసింది.కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దేశ్ చంద్రశేఖర్ శనివారం సూసైడ్ చేసుకున్నారు.

జమ్మికుంట మండలం పరిధిలోని సీతంపేటలో ఉన్న తన అత్తవారి ఇంటికి వెళ్లి అక్కడే ఉరేసుకొని ప్రాణాలు విడిచారు. విధి నిర్వహణలో ఎంతో చురుకుగా ఉండే చంద్రశేఖర్ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం పోలీస్ శాఖలో కలకలం రేపింది. చంద్రశేఖర్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం భార్య దివ్య మృతి అని స్థానికులు చెబుతున్నారు. సరిగా ఐదు రోజుల క్రితం దివ్య ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా ఆమె తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గత మంగళవారం మధ్యాహ్నం ఆ నొప్పిని భరించలేక గన్నేరు పువ్వుల రసం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న చంద్రశేఖర్‌కు దివ్య ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆయన వెంటనే ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి దివ్య మరణించింది. దివ్య తండ్రి తెడ్ల చిన్న సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భార్య మరణించినప్పటి నుంచి చంద్రశేఖర్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఆమెతో గడిపిన జ్ఞాపకాలు, ఆమె లేని ఒంటరితనం ఆయనను కుంగదీశాయి. హనుమాన్ నగర్‌లో నివసిస్తున్న చంద్రశేఖర, భార్య మరణం తర్వాత తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. చివరకు భార్య మరణించిన ఐదు రోజులకే ఆమె వద్దకు వెళ్లిపోవాలని నిర్ణయించుకొని సీతంపేటలో ఆత్మహత్య చేసుకున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరూ మరణించడంతో రెండు కుటుంబాలు కోలుకోలేని విషాదంలో మునిగిపోయాయి.

## చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా..?

- చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో రేవంత్ రెడ్డికి... మూసీ బాధితురాలు

**జయభేరి, హైదరాబాద్, మార్చ్ 21:**

కాంగ్రెస్ సర్కారు మూసీ సుందరీకరణ పేరుతో చేస్తున్న దౌర్జన్యంపై మూసీ బాధితుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాము ఎంతో కష్టపడి కట్టుకున్న ఇంటిని తొలిగిస్తామంటే ఊరుకునే లేదని స్పష్టం చేస్తున్నారు. పిల్లలకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదంటూ ఓ తల్లి కన్నీరు మున్నీరైంది. మూసీ బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మా రేపు మన ఇల్లు కూలగొడుతున్నారట కదా.. ఏంటీ మన పరిస్థితి అని అడుగుతుంటే.. ఏం చెప్పాలో అర్థం కావట్లేదు. నేను ఒకరికి ధైర్యం చెప్పాల్సింది పోయి.. నేను ధైర్యం కోల్పోతున్నాను. నాలాంటి పరిస్థితి ఎదుర్కోకండి. తల్లి తర్వాత ఇంకో తల్లిని తీసుకొస్తాను.. నష్టపరిహారం ఇస్తాను అంటే ఒప్పుకుంటారా..? ఈ తల్లి వద్దు నీకు వేరే తల్లిని తీసుకొస్తానంటే ఒప్పుకుంటారా..? కాదు కదా.. ఇది మా ఇల్లు.. కష్టపడి కట్టుకున్న ఇల్లు. డ్రీమ్ హౌస్ అని అంటం. దయచేసి మా కలను చెదర్చకండి.. మాకో విలువ ఉంది.. మమ్మల్ని గుర్తించండి.. ప్రతీ ఒక్కరికి చెప్పేదేంటంటే మమ్మల్ని కూడా ఇక్కడ ఉండనీయండి. ఎలాంటి నష్ట పరిహారం మాకొద్దు. ఇచ్చినా ఏవిధంగా ఇస్తరు..ఝ మా ఇంటిలో మేం ప్రశాంతంగా ఉండానుకుంటున్నాం.. మా జీవితాలతో గేమ్స్ ఆడకండి.. మీకు గేమ్స్ ఇష్టమోమో వేరే విధంగా ఆడుకోండి. దయ చేసి మా జీవితాలు కాపాడండి అంటూఓ మహిళ కన్నీరుమున్నీరైంది.రేవంత్ రెడ్డికి చిన్నప్పటినుండి సరైన గురువు లేడేమో అందుకే ఇలా చేస్తున్నాడు, మా దగ్గరికి రండి మా పిల్లలు చదువు చెప్తారని మండిపడ్డది. ఇలాంటి పనులు చేస్తే మా వాల్యూ కాదు రేవంత్ రెడ్డి వాల్యూ జీరో అవుతుంది. మీ తల్లిని తీసుకెళ్లి ఇంకొక తల్లిని ఇస్తామంటే ఊరుకుంటారా? మా ఇల్లు కూడా మాకు తల్లితో సమానమే.. దయచేసి మా జీవితాలతో ఆడుకోకండి ఇదేమన్న చాక్లెట్ ఆ లేక బిస్కెట్ ఆ అడగగానే ఇవ్వడానికి..కష్టపడి కట్టుకున్న ఇల్లు అని హెచ్చరించింది. ఒకరు వచ్చి హైదరాబాద్ సింగపూర్ చేస్తా అంటారు.. ఇంకొకరు మీ ఇల్లు కూలగొట్టి సుందరీకరణ చేస్తా అంటారు.. చిన్న పిల్లల ఆటల్లాగా ఉందా? రేవంత్ రెడ్డి తెలంగాణ ఎకానమీ పెంచుతా అనడం పెద్ద జోక్ లాగా ఉంది, ఆయనకు ఎప్పుడూ ఆయన ఎకానమీ పెంచుకోవడం మీదనే ధ్యాస ఉందంటూ సదరు మూసీ బాధితురాలు తీవ్ర స్థాయిలో ఆరోపించింది.



## టీజేపీకి లైన్ క్లియర్

ఈ న్యాయపోరాటం ద్వారా పార్టీని సాధ్యమైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో 'తెలంగాణ జాగృతి' అనే సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడంలో కవిత విజయవంతమయ్యారు. ఇప్పుడు దాదాపు అదే పేరును రాజకీయ పార్టీగా మార్చడం వెనుక సెంటిమెంట్, బ్రాండ్ వాల్యూ రెండూ ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి ప్రాతిపదికన తన రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలనేది ఆమె ఆలోచనగా కనిపిస్తోంది. పార్టీ నమోదు విషయంలో ఈసీఐ లేవనెత్తిన లోపాలు ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. రాజకీయ పార్టీ నమోదుకు ఉండాల్సిన నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నిధుల సమీకరణ, పార్టీ రాజ్యాంగం, సభ్యత్వ వివరాల్లో స్పష్టత ఉండాలి. హైకోర్టు ఈ విషయంలో ఈసీఐకి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ నీడలో కాకుండా, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ వేదిక ఉండాలని ఆమె ఆశిస్తున్నారు. మహిళా సాధికారత, తెలంగాణ హక్కులే ప్రధాన ఎజెండాగా ఈ పార్టీ పనిచేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె ఎదుర్కొంటున్న లిక్కర్ స్కామ్ కేసుల నేపథ్యంలో, రాజకీయంగా యాక్టివ్‌గా ఉండటం ద్వారా ఆ ఆరోపణలను ఎదుర్కోవాలని ఆమె యోచిస్తున్నారు. జాగృతి సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌ను నేరుగా రాజకీయ శక్తిగా మార్చడం ఈ పార్టీ ఉద్దేశ్యం 'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. యితే సాంకేతిక లోపాలను సవరించుకోకుండా.. కవిత కోర్టుకు వెళ్లడం ఏమిటన్న విస్మయం వ్యక్తమవుతోంది. ఆ సాంకేతిక లోపాలు పరిష్కరించలేనివి అయితే తప్ప ఇలా చేయరని.. భావిస్తున్నారు. కవిత ఇప్పుడు ఆ సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటే తప్ప.. రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎలాగోలా నెల రోజుల్లో పూర్తి చేసి తన పార్టీని ప్రకటించాలని కవిత ప్రయత్నిస్తున్నారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు ఇది అనుబంధ శక్తిగా మారుతుందా లేదా కవిత స్వతంత్ర గళాన్ని వినిపిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి దిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఈ కొత్త పార్టీ ప్రస్థానానికి పునాది కానుంది.

# యాదగిరిగుట్టలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

- శ్రీవారి నిత్యరాబడి రూ.45.18 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 21:**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రంజాన్,ఆదివారం సెలవు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ



సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా శనివారం రూ.45,18,473 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,78,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,41,400, వీఐపీ దర్శనం ద్వారా రూ.7,50,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,12,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,07,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.14,23,980, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా 5,29,000, కల్యాణకట్ట ద్వారా రూ.1,12,500తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడి సేవలో నవీన్‌రావు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ కె.నవీన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

---

# గొర్ల కాపరుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



గొర్రెల మేకల పెంపకందారుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు కోరారు. శనివారం గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే నివాసంలో బీర్ల అయిలయ్యను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల ప్రధాన సమస్యలైన నగదు బదిలీ, గొర్రెల భీమా, గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, 50సంవత్సరాలకు రూ.5000 పింఛన్లు,సొసైటీలకు కొత్త జిల్లాల ప్రాతిపదికన యూనియన్లు ఏర్పాటు మొదలైన వృత్తి సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు దాటినా ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదన్నారు. గొర్రెల పెంపకందారుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ్మ,ఉపాధ్యక్షుడు బుడుమ శ్రీశైలం,సహాయ కార్యదర్శులు కొండే శ్రీశైలం, ఎల్లంల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు నారి వెంకటేష్,మన్నెబోయిన రాజలింగం,పాక జహంగీర్, కడెం బీరప్ప, జోగు శ్రీనివాస్, ఎర్రోళ్ల ఉపేందర్,లెంకల యాదయ్య,మేడబోయిన యాదగిరి,బీమగోని జంగయ్య,మన్నెబోయిన మల్లయ్య,అవిశెట్టి పాండు పాల్గొన్నారు.

---

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- స్టాప్ డ్రగ్స్-స్టార్ట్ స్పోర్ట్స్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**




భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువ భాగస్వామ్యం కావాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో స్టాప్ డ్రగ్స్‌స్టార్ట్ స్పోర్ట్స్ పేరిట వాలీబాల్ టోర్నమెంట్‌ను యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రతో కలిసి బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువతకు భగత్ సింగ్ ధైర్యం,త్యాగం,దేశభక్తి యొక్క ప్రతీక అని,ఆయన చూపిన మార్గం మనకు నేటికీ ప్రేరణ అని అన్నారు. నేటి యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వ్యసనం భవిష్యత్‌ను నాశనం చేస్తుందని ,ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని ,దేశ భవిష్యత్తుకు కూడా ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ,జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బబ్బూరి శ్రీధర్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, సిపిఐ నేతలు పేరబోయిన బంగారి, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య, గాదెగాని మాణిక్యం, అనంతుల నరసింహ, కంబాల వెంకటేష్, ఎర్ర అశోక్, తోటకూర శేఖర్, కంబాల నరసింహ, మహేష్, బందారపు భిక్షపతితో పాటు 16 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

---

# ముస్లిం సోదరులకు హైకోర్టు న్యాయవాది పండుగ శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ ఈద్గా వద్ద శనివారం ముస్లిం సోదరులకు హైకోర్టు న్యాయవాది, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కౌన్సిలర్ ప్రేమ్ కుమార్,మురళి గౌడ్,సాదిక్,సమీర్,చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ లతోపాటు బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

---




# ముస్లిం సోదరులకు ప్రశాంత్ రెడ్డి పండుగ శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ముస్లిం సోదరులకు శనివారం నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమానురాగాలకు ప్రతీక రంజాన్ పండుగ అని ఆయన అన్నారు. ఎంతో పవిత్రమైన ఈ పండుగను ముస్లిం సోదరులు ఐకమత్యంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం అని ప్రశాంత్ రెడ్డి అన్నారు.

---

# ముస్లిం సోదరులకు ప్రదీప్ గౌడ్ శుభాకాంక్షలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో శనివారం రంజాన్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరిని ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులతో కలిసి ఫోటోలు దిగి వారికి కూడా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

---



# ఘనంగా రంజాన్ వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 21:**

యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈద్గాల దగ్గర ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శనివారం జరిగిన రంజాన్ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సౌభ్రాతృత్వం,ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. అన్ని మతాల ప్రజలు కలిసి శాంతి, సామరస్యంతో జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉందని, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. రంజాన్ వేడుకల్లో ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

---

# ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే జిఎంఆర్ పండుగ శుభాకాంక్షలు

- భూత్పూర్, అమిస్తాపూర్ ఈద్గాలలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని భూత్పూర్ మున్సిపాలిటీ తోపాటు అమిస్తాపూర్ లోని ఈద్గాల వద్ద శనివారం జరిగిన రంజాన్ పండుగ ప్రార్థనలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరిని ఆ లింగం చేసుకొని ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ బాలకోటి, వైస్ చైర్మన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

# ఘనంగా రంజాన్ ఈద్‌ఉల్‌ఫితర్ పండుగ వేడుకలు

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలో ని దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం రంజాన్ ఈద్‌ఉల్‌ఫితర్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పండుగను ఆనందోత్సాహాలమధ్య, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి ఊరేగింపుగా స్థానిక ప్రార్థన స్థలాల వద్దకు వెళ్లి ముస్లిం సోదరులు పండుగ సందర్భంగా మత పెద్దలు వినిపించిన ఖుద్బాను విన్నారు. ఆ తర్వాత ప్రత్యేక పండుగ నమాజు చదివారు. తమ యోగ క్షేమాల కోసం దేవుణ్ణి (అల్లాహ్) ను వేడుకున్నారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని ఆయా పార్టీల చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈద్గాల వద్దకు వచ్చి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ నమాజ్ అనంతరం తమ గ్రామాలలోని స్మశాన వాటికల వద్దకు వెళ్లి మృతి చెందిన తమ బంధువుల సమాధులపై గులాబీ పూలు చల్లి ప్రత్యేక దరూద్ చదివారు. పూర్తిచేసిన తమ వారికి నరకాగ్ని నుండి కాపాడాలంటూ ఆ దేవుని వేడుకున్నారు. ఈద్గాల నుండి తమ తమ ఇండ్ల వద్దకు వచ్చి ముస్లిం సోదరులు పండగ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన తీపి వంటకం అయిన షీర్ ఖుర్మాను ఆరగించారు. సమీప బంధువులు, స్నేహితులకు విందులు ఏర్పాటు చేశారు.

---

# ముస్లిం సోదరులకు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ల శుభాకాంక్షలు




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం ఈద్గా వద్దకు వెళ్లి ముస్లిం సోదరులకు స్థానిక మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బల్సుపల్లి లక్ష్మీకాంతరెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగెంధర్ రెడ్డి, కౌన్సిలర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# మొండిచెయ్యి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బడ్జెట్ లో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నం చేయలేదు
- అంకెల గారడీ, మాటల గారడీ తప్ప పేదల పట్ల చిత్తశుద్ధి లేదు
- కేవలం కుంభ కోణాల కోసమే ఈ బడ్జెట్ పెట్టుకున్నరు
- కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తామన్న 2,500ల ఊసే లేదు.
- తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు
- మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ స్వగ్రాంలో విలేకరుల సమావేశం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 'అభయహస్తం' మేనిఫెస్టోతో ప్రజలను నమ్మబలికి ఓట్లు దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇ మూడో బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ ఆ హామీలకు చట్టబద్ధత కల్పించకుండా, నిధులు కేటాయించకుండా ప్రజలను వంచిస్తోంది అని ఆయన తెలిపారు.జేమ్స్ బాండ్‌ల మాదిరిగా బాండ్ పేపర్లు రాసిచ్చి, 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా 'గ్యారెంటీ' అన్న మాట లేకుండా, 'డిక్లరేషన్' అన్న మాట లేకుండా ప్రతి వర్గాన్ని వంచిస్తున్నారు.అన్ని వర్గాల ప్రజల చెవిలో పువ్వులు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు.బడ్జెట్ లో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నం చేయలేదు అని ఆయన తెలిపారు.ఈ బడ్జెట్ లో సకల జనులకు మొండిచెయ్యి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు.అంకెల గారడీ, మాటల గారడీ తప్ప పేదల పట్ల చిత్తశుద్ధి లేదు అని ఆయన తెలిపారు.ఆరు గ్యారంటీల ఊసే లేదు అని అన్నారు.కేవలం కుంభకోణాల కోసమే ఈ బడ్జెట్ పెట్టుకున్నరు అని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల అమలు ఫైలు పైన సంతకం,గ్యారంటీల గారడీతో నాలుగు కోట్ల మందికి టోపీ పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని ఆయన తెలిపారు. ప్రపంచ ఎన్నికల చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం మేనిఫెస్టో అత్యంత పెద్ద ఫ్రాడ్ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 840 రోజులు గడిచిపోయాయి కానీ అర గ్యారంటీ కూడా అమలు కాలేదు అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తామన్న 2,500 ల ఊసే లేదు అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 15 వేల రైతు భరోసా గురించి బడ్జెట్ లో ప్రస్తావనే లేదు అని ఆయన అన్నారు.నియోజకవర్గంలో ఆరు గ్యారంటీలు అడగడం లేదు అనడం విడ్డూరం అని ఆయన అన్నారు.నా వెంట పోలీసులు లేకుండా రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు అని ఆయన అన్నారు.నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది అంటూ ప్రశ్నించారు.ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ. 24,000లో, సంవత్సరానికి రూ. 12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ. 4,000 చొప్పున మొత్తం రూ. 54,000 బాకీ ఎక్కడ అని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని ఆయన అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సంపాదనను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.బలహీన వర్గాలకు లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి, మూడు బడ్జెట్లు కలిపినా 20 వేల కోట్లకు మించకుండా కేటాయించడాన్ని ప్రశ్నించారు. వృద్ధులు, వితంతువులు ఎదురుచూస్తున్న రూ. 4,000 పెన్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.మహిళలకు 18 ఏళ్లు నిండిన కోటి 58 లక్షల మందికి ఇస్తామని చెప్పిన రూ. 2,500 మహాలక్ష్మి పథకం ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 లక్షల దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్ హామీ అమలు చేయాలన్నారు. రైతులకు రైతు భరోసా పేరుతో రూ. 15,000 ఇస్తామని చెప్పి, ఇప్పటికే ఉన్న రైతుబంధునే అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్రాంతికి రావాల్సిన డబ్బులు ఉగాది దాటినా రాకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఉద్యోగాల విషయంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 11,900 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, ఇది యువతను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ నేనావత్ కిషన్ నాయక్, మండల అధ్యక్షులు TVN రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, బిఆర్ ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, కౌన్సిలర్లు విరమోని అంజి గౌడ్, కేతావత్ రుప్లా నాయక్, పొట్ట మురళి, పొట్ట మధు, బొడ్డుపల్లి కృష్ణ, ఇమ్రాన్, ముదిగొండ హరిదాస్, జైపాల్, అంజి, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 21 :

తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులు, గ్రామస్తులతో కలిసి ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు ముస్లిం సోదరుల తరఫున దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీతారాజు, ఉప సర్పంచ్ ధరావత్ మంగ్యా నాయక్, మాజీ సర్పంచ్ హరినాయక్, పనగట్ల సుదర్శన్, వార్డు సభ్యులు లెంకల రంజిత్, వనగట్ల లక్ష్మణ్ ,అన్నారం రాజు, ముస్లిం సోదరులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 21 :

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభను వెలికి తీయడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదపడతాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 22న భువనగిరి జూనియర్ కళాశాలలో జరిగే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, కేంద్ర సహాయ మంత్రి బి ఎల్ వర్మ, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్, ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లీ గంజ్ హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ క్రీడోత్సవాన్ని విజయవంతం చేయడానికి అందరు పాల్గొని క్రీడాకారులను చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు యాట పెంటయ్య కందుకూరి చిన్న చలమయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, యువ మోర్చా జిల్లా కార్యదర్శి మేకల పాండు యాదవ్, గుండెబోయిన మల్లేశం, పిడుగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## చింతపల్లిలో నిరాహార దీక్ష కరపత్రాల ఆవిష్కరణ



జయభేరి, చింతపల్లి :

ఎస్సీ సంక్షేమ పథకాల సాధనకై మార్చి 30న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగ దండోరా నిరాహార దీక్ష కరపత్రాలను శనివారం చింతపల్లి మండలం అంబేద్కర్ చౌరస్తా లో ఆవిష్కరించారు మండల అధ్యక్షుడు సందే ఏసు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు రాంజీ సైదులు మాదిగ జిల్లా నాయకులు కొండేటి మధు, రాష్ట్ర నాయకులు ఎర్ర జగన్ మాదిగ, రామకృష్ణ, కంబాలపల్లి రామకృష్ణ, సంధ్య, ముత్తయ్య, పేర్ల చిన్న మల్లయ్య, శంకర్, కంబాలపల్లి గిరి తదితరులు పాల్గొని హక్కుల సాధన కోసం మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలి.

## షాద్ నగర్ లో ఘనంగా రంజాన్ వేడుకలు

- రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, మార్చి 21 :

రంజాన్ పండుగ సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఈద్గా వద్ద మైనారిటీ సోదరులను కలుసుకుని రంజాన్ పండుగ ముబారక్ తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశం. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుంది. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంటూ.. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో మైనారిటీ సోదరులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆప్యాయ పలకరింపులు

జయభేరి, దేవరకద్ర :

రంజాన్ పండుగను పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని ఆయా మండలాలలో శనివారం ఈద్గాల వద్దకు వెళ్లిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చిన్నారులతో ఆప్యాయంగా పలకరించారు. వారికి పేరుపేరునా పలకరించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారి కోరిక మేరకు వారితో కాసేపు గడిపి ఫోటోలు దిగారు. దీంతో చిన్నారులు ఎమ్మెల్యేకు కరచాలనం చేసి సంబరపడ్డారు.

## పేరూరులో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలు అందజేసిన సర్పంచ్




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కౌకుంట్ల మండలం పేరూరులో శనివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు సర్పంచ్ కొత్త శృతి అరవింద్ రెడ్డి పండుగ తోఫాలను అందజేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే ఆల శుభాకాంక్షలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన పండుగ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ తో పాటు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మైనార్టీ సోదరులు తదితరుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మన్యంకొండలో ఘనంగా పల్లకి సేవ

- అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవా పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తీరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామి వారిని దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకోవచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురుల మధ్య స్వామి వారి ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా మండపంలో స్వామివారికి దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్ తో సమాజంలో ఐక్యత, శాంతి పరస్పర గౌరవం పెరుగుతుంది

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
- షాద్ నగర్ ఈద్గా వద్ద మైనారిటీ సోదరుల ప్రార్థన
- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, మార్చి 21 :

రంజాన్ మాసంతో సమాజంలో ఐక్యత,శాంతి పరస్పర గౌరవం పెరుగుతుంది ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా మైనార్టీ సోదరుల ప్రార్థనకు చేరుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం ద్వారా కేవలం ఆధ్యాత్మిక శుద్ధి మాత్రమే కాదని,పరస్పర గౌరవం,సహనం వంటి విలువలను కూడా నేర్పిస్తుందని విభిన్న మతాలు ఉన్నా మనందరి లక్ష్యం శాంతి, మానవత,సౌభ్రాతృత్వమేనని ఐక్యతతో ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఈ రంజాన్ పర్వదినం మనలో ప్రేమను పెంపొందించి, సమాజంలో శాంతి,ఐక్యతను బలపరచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు పిల్లి శేఖర్,రఘునాథ్ యాదవ్, గౌస్ జానీ,అడ్డు అజాజ్,సుధీర్,యాదగిరి ,రవీందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్,పల్లె శ్రీనివాస్ రెడ్డి,సలీం, ప్రముఖ పత్రికేయులు ఖాజపాషా,మైనారిటీ నేతలు పర్వేజ్,బిలాల్ యువ నాయకులు దినేష్ సాగర్,శివ చారి,అల్లాడ శేఖర్,అన్మరి రాజు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో ఘనంగా రంజాన్ వేడుకలు

- మతసామరస్యాన్ని చాటిన గ్రామ ప్రజలు..
- ముస్లీం సోదరసోదరీమణులకు తోఫా దుస్తుల కిట్లను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ ముత్యంరెడ్డి..
- సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేసిన ముస్లిమ్ సోదరులు




జయభేరి, సిద్ధిపేట, మర్చి 21:

సిద్ధిపేట జిల్లా తునికి బొల్లారం గ్రామంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెంకన్నగారి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లోభాగంగా గ్రామంలో సోదరభావాన్ని మరింత బలపరిచింది. ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు పాటిస్తూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఈ తోఫాలు అందజేయడం ద్వారా సర్పంచ్ ముత్యం రెడ్డి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ అనేది త్యాగం, నియమ నిష్ఠలు, దానం వంటి విలువలను గుర్తు చేస్తుందని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, శాంతి సామరస్యాలతో ఉండాలని ఆయన సూచించారు. మత భేదాలు లేకుండా ప్రతి పండుగను పరస్పరం గౌరవించుకోవడం మన భారతీయ సంస్కృతి ప్రత్యేకత అని అన్నారు. గ్రామ ప్రజలు సైతం ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. అదేవిదంగా ముస్లిం సోదరులు కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# టౌన్ ప్లానింగ్ అధికారి ఆడిందే ఆట పాడిందే పాట

- మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- అధికారుల కనుసన్నాల్లో సెల్లార్ కమర్షియల్ బహుళ అంతస్తుల భవనాలు
- మున్సిపల్ కార్యాలయం అక్రమార్కుల అడ్డగా మారిందనే విమర్శలు
- ఫిర్యాదులు చేసినా... ఫికర్ లేదంటున్న అధికారులు
- జవహర్ నగర్ అభివృద్ధి కోసం అన్ని విధాల అనుమతులు ఇవ్వాలి
- రోడ్లను ఆక్రమిస్తూ భవన నిర్మాణాలు మామూళ్ల మత్తులో అధికారులు
- అధికారుల ఆస్తులపై ఏసీబీ అధికారులు సోదరులు నిర్వహించాలి

**జయభేరి, జవహర్ నగర్ :**

మున్సిపల్ నిబంధనలను మూసిలో కలిపి వందలాది బహుళ అంతస్తులు సెల్లార్లతో కూడిన కమర్షియల్ భవన నిర్మాణాలను ప్రోత్సాహిస్తూ విధి నిర్వహణలో టౌన్ ప్లానింగ్ అధికార యంత్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు జవహర్ నగర్ ప్రాంతం నగర పాలక ప్రాంతంగా ఆవిర్భవించిన నాటి నుండి నేడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంలో విలీనమైనప్పటి వరకు గృహ నిర్మాణాల రద్దు నిబంధనతో గత ఆరు సంవత్సరాల వ్యవధిలో ధనార్జనే లక్ష్యంగా ప్రధాన రహదారి పక్కన కోట్ల విలువ చేసే స్థలాల్లో సెల్లార్లతో కూడిన కమర్షియల్ బహుళ అంతస్తుల భారీ భవన నిర్మాణాలతో పాటు భారీ వాహనాలు బస్తీల్లోకి రావడానికి ఆటంకం కలిగించే విధంగా రోడ్లను ఆక్రమిస్తు నిర్మిస్తున్న భవన నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా గాఢ నిద్రలో మునిగితేలుతు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటీ..? ప్రభుత్వం ఇచ్చే జీతాలకన్నా అనుమతులు లేకుండా అక్రమ మార్గంలో నిర్మించే భవన నిర్మాణదారులు ముట్టజెప్పే అక్రమ సంపాదనకు అధికారులు ఆసక్తి చూపుతున్నారా..? లేక.. విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా..? లేక.. చట్టం ఎవరికి చుట్టం కాదు అనే విషయాన్ని మరిచి అధికారులం అనే అహంతో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా..? అనే విమర్శలు ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి ఏలాంటి విమర్శలకు తావు ఇవ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉంటే గృహ నిర్మాణాల అనుమతుల రద్దు నిబంధనను ఉల్లంఘించి జవహర్ నగర్ ప్రాంతంలో వందలాదిగా అక్రమ మార్గంలో భవన నిర్మాణాల తతంగం ఎలా కొనసాగుతోంది వందలాదిగా నిర్మాణం అవుతున్న ఈ భవన నిర్మాణాల తతంగం అధికారుల కనుసన్నాల్లోనే జరుగుతోంది... అధికారులు అక్రమాలకు పాల్పడుతూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు అనడానికి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ భవన నిర్మాణాలు నిలువెత్తు నిదర్శనాలు కాదా...? అని స్థానికులు నిలదీస్తున్నారు.






బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న అధికారులను విధుల నుండి తొలగించాలి

రాష్ట్ర అభివృద్ధి ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న ఈ సమయంలో మున్సిపల్ నిబంధనలకు నీళ్లు వదులుతూ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు కమర్షియల్ భవన నిర్మాణాలు భారీ వాహనాలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించే భవన నిర్మాణాలను అరికట్టేందుకు ఏ మాత్రం సుముకథ చూపకుండా అంతా నా ఇష్టం అన్నట్లుగా మున్సిపల్ నిబంధనలను విస్మరిస్తూ జవహర్ నగర్ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు గృహ నిర్మాణాలకు అనుమతులు లేని జవహర్ నగర్ ప్రాంతంలో వందలాదిగా భవన నిర్మాణాలు అధికారుల అండదండలు లేకుండానే వెలుస్తున్నాయా అనే నిలదీతలు అధికమవుతున్నాయి ఇప్పటికైనా గత ఆరు సంవత్సరాల నుండి నిర్మాణం అవుతున్న అనుమతులు లేని భవన నిర్మాణాలు రోడ్లను ఆక్రమిస్తూ జవహర్ నగర్ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ నిర్మిస్తున్న భవన నిర్మాణాల దార్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ జవహర్ నగర్ అభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు కారణమైన టౌన్ ప్లానింగ్ అధికారి వ్యవహార శైలిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దర్యాప్తు జరిపించి విధి నిర్వహణలో అక్రమాలకు తావిస్తూ బాధ్యత రహితంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిన యెడల టౌన్ ప్లానింగ్ అధికారి పై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**గృహ నిర్మాణాల అనుమతుల రద్దు స్థానికులకు శాపమై... అధికారులకు వరమైందా...?**

గృహ నిర్మాణాలకు అనుమతులు లేకపోవడంతో గత 35, 40, సంవత్సరాల క్రితం నిర్మించుకున్న పాత గృహ నిర్మాణాలు శిధిలావస్థకు చేరుకోవడంతో ఇల్లు కూలిపోతే కుటుంబ సభ్యులందరూ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందనే భయంతో కొందరు పిల్లాపాపలతో కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగి గృహ విస్తీర్ణం సరిపోక మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో బాధిత ప్రజలు నూతన గృహ నిర్మాణాలు చేసుకుంటున్న సమయంలో అధికారులు దొడ్డిదారిన దోపిడికి పాల్పడేందుకు గృహ నిర్మాణాల అనుమతుల రద్దు నిబంధనే సరైన సదావకాశంగా భావించి గృహ నిర్మాణాలకు అనుమతులు లేవంటూ కాళ్లు వేళ్ళు మొక్కినా దయ కనిగ్రహం చూపకుండా జెసిబి లతో కూల్చివేతలకు పాల్పడి నిర్మాణదారులను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తదుపరి కొందరు కార్పొరేటర్లను మధ్యవర్తిత్వం వహించే దళారీలుగా ఎంచుకొని తెరచాటుగా గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి ఒక లక్ష రూపాయలు మొదటి అంతస్తు నిర్మాణానికి యాబై వేల రూపాయలు రెండవ అంతస్తు నిర్మాణానికి యబై వేల రూపాయలు ఇలా ఎన్ని అంతస్తుల భవన నిర్మాణాలు చేసుకుంటే అన్ని యాబై వేల రూపాయలతో పాటు సెల్లార్లు రెండవ అంతస్తులను మించి మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేసినందుకుగాను అధిక మొత్తంలో లంచం చెల్లించే విధంగా లోపాయికార ఒప్పందాలు చేసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు కోట్లు దండుకుంటున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయి నేడు వందల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఏలాంటి చర్యలు తీసుకోకుండా ఫిర్యాదులను పట్టించుకోకుండా అధికారులు చేతులు ముడుచుకొని చోద్యం వహిస్తూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడడానికి ప్రధాన కారణం లంచాల... మహత్యమేనని స్థానికులు మండిపడుతున్నారు.

**అధికారుల గూడుపుఠాణి వ్యవహారం నెగ్గు తేల్చి... అక్రమ ఆస్తులను జప్తు చేయాలి**

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణదారులు రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేస్తున్న భవన నిర్మాణదారులు సెల్లార్లు కమర్షియల్ బహులాంతస్తుల భవన నిర్మాణ దారుల వద్ద తెరచాటుగా లోపాయి కార ఒప్పందాలు కుదుర్చుకొని పెద్ద ఎత్తున లంచాలు గుంజుతూ దొడ్డి దారిన దోపిడీకి పాల్పడుతూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే స్థానికుల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నేడు జవహర్ నగర్ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా వందల కొలదిగా అనుమతులు లేకుండా వెలుస్తున్న అక్రమ భవన నిర్మాణాల పై ప్రత్యేక దర్యాప్తు చేపట్టి అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు తేలిన ఎడల అవినీతి నిరోధక శాఖ అధికారులు అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులను జప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

**గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి**

జవహర్ నగర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన ఈ సమయంలోనైనా గృహ నిర్మాణాలకు అన్ని విధాలుగా అనుమతులు ఇచ్చే అవకాశాన్ని కల్పించి జవహర్ నగర్ ప్రాంత అభివృద్ధికి చేయూతనిస్తూ మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేల కృషి చేయాలని జవహర్ నగర్ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు గృహ నిర్మాణాల అనుమతుల రద్దు కారణంగా ఎందరో దళారీలు మధ్యవర్తిత్వం పేరుతో దోపిడికి పాల్పడడం వల్ల మున్సిపాలిటీ ఆదాయానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడంతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా జవహర్ నగర్ ప్రజల అభ్యర్థనను అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే గృహ నిర్మాణాల అనుమతులతో పాటు అన్ని విధాల అనుమతులు లభించే సదవకాశాన్ని కల్పించి జవహర్ నగర్ అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- తోటకూర వజ్రేశ్ యాదవ్
- పేదలకు గృహ కల సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్లు రావడంతో సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



**జయభేరి, శామీర్ పేట్, మార్చి 21:**

వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. మల్కాజ్ గిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ 300 డివిజన్ లోని హకీంపేట్ లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సింహులు యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, వజ్జల శేశాంత్ లు పాల్గొని లబ్ధిదారులు అయిన వజ్జల కళావతి-యాదగిరి దంపతులు సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదల జీవితాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతాయని, అన్నారు. ప్రభుత్వం అందించే సాయం సరైన విధంగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కాగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ,తమకు సహకరించిన నాయకులు మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మాజీ సర్పంచ్ ఎద్దు నాగేశ్ యాదవ్, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారనంది బాల్ రాజు, మహమ్మద్ జాఫర్, మన్నె బిక్షపతి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి శశిధర్ రెడ్డి, నాయకులు పాండు, నక్క మల్లేష్ గౌడ్, కుడుముల వెంకటేష్, కీసరి భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొటి రూపాయల అటెండన్స్ వివాదం

**జయభేరి, హైదరాబాద్, మార్చి 21 :**

సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్ లో పడే మెసేజ్ లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (AI) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు. నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ' అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!



## శామీర్‌పేటలో ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గా వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 21:**

ఎంతో నియమ నిష్ఠలతో నెల రోజుల ఉపవాసాల అనంతరం శనివారం మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శామీర్ పేట్ లోని ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కాగా శామీర్ పేట్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఈద్గా వద్దకు చేరుకొని ముస్లీం సోదరులకు అలయ్ బలయ్ తో శుభాకాంక్షలు తెలిపారు. అయితే సోదర భావంతో అందరూ ఈ వేడుకల్లో పాల్గొనడం పట్ల అందరు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా ఉదయం నుంచే పటిష్ఠంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం ముస్లీం సోదరులకు అత్యంత పవిత్రమైన మాసం అని ఈ సందర్భంగా పలువురు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఎంపిటిసి లు విలాసాగరం సుదర్శన్, దప్పు సాయిబాబా, ఐలయ్య యాదవ్,ముస్లిం మైనార్టీ నాయకులు సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్,హజ్ కమిటీ మెంబర్ మహ్మద్ ముజీబుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి మతీన్,చాంద్ పాషా, నజామ్ ,మహ్మద్ ఇర్ఫాన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, ఇస్మాయిల్ ఖాన్,మహ్మద్ యూసుఫ్, మహ్మద్ ఫారూఖ్, మహ్మద్ నాసర్ అలీ, ఇలియాస్,అజ్మత్,సమీయోద్దీన్,షఫీయోద్దీన్, మహ్మద్ అరాఫత్,ఇమ్తియాజ్ అహ్మద్,మహబ్బాబ్ జానీ, నసీర్ ఖాన్, షోయబ్, అక్రమ్, అక్బర్ ఆజం,వంగ నర్సింహా రెడ్డి, దూడల నరేష్,పసుపుల నర్సింహా, మల్లేష్, సునీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- మతసామరస్యానికి ప్రతీక - కౌన్సిలర్ గాదె వెంకటేష్

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 21:**

గత నెల రోజులుగా కఠోర నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలతో ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలను విరమించారు. ఈ సందర్భంగా అలియాబాద్‌లో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ఈద్గా వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ గాదె వెంకటేష్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ అనేది త్యాగం, నియమ నిష్ఠలు, సేవాభావానికి ప్రతీక అని అన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి, చివరి రోజు పండుగను ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. పండగ నాడు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావంతో పండుగను జరుపుకోవడం సమాజానికి ఆదర్శమని తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్వమత సామరస్యాన్ని చాటిన రంజాన్ వేడుకలు...


- రంజాన్ పర్వదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, మార్చి 21 :**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో జరిగిన పలు రంజాన్ వేడుకలలో బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. పీర్లగూడలో నవాజ్ గోరి స్వగృహం లో,విట్యాలలో వాహబ్, ఇసాక్ స్వగృహంలో, షాద్ నగర్ పట్టణంలో శివ గార్డెన్‌లో కౌన్సిలర్లు మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), సర్వర్ పాష సంయుక్తంగా ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మైముద్ స్వగృహంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొని సోదరభావాన్ని పంచుకున్నారు. రంజాన్ వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ పండుగ మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ముందుకు సాగితేనే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మోహన్ సింగ్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, కుడుముల బాల్ రాజ్, శ్యామ్ సుందర్ రెడ్డి, చెవుల బాస్కర్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## శ్రీశైలంలో పరకామణి సేవలో దేవరకొండ భక్త బృందం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మహిళా భక్తులు శ్రీశైలం భ్రమరాంబిక దేవస్థానం లో దేవరకొండ నుండి నీల సంధ్యారాణి ఆధ్వర్యంలో శ్రీశైలం లో ఒకరోజు పరకామణి సేవ డబ్బులు లెక్కించడం లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మాకు శ్రీశైలం మల్లన్న స్వామి ఇంతటి అదృష్టం వస్తుంది అనుకోలేదు అన్నారు. మేము కోరుకుందల్లా మేము బాగుండాలి అందరు బాగుండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీల సంధ్యారాణి, దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష, సముద్రాల సత్య శ్రీవాణి, కుంచకూరి సంధ్య, కుంచకూరి శిరీష, మంచి కంటి పద్మ, కందుకూరి కీర్తి, నారాయణమ్మ, అరుణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసదనం నిర్మాణ విరాళం




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సేవాసదనం మొదటి అంతస్తూ నిర్మాణ నిధికి సభ్యులు రామావత్ కపూర రిటైర్డ్ దంపతులు సమావేశంలో తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి అధ్యక్ష, కార్యదర్శిలకు రూ. 10,116 విరాళం అందజేసినారు. ఈ సందర్భంగా కోశాధికారి, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సేవాసదనం నిర్మాణమునకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేసినారు.దాత కపురా మాట్లాడుతూ మా పెన్షనర్స్ సభ్యులకు దేవరకొండ పెన్షనర్స్ సంఘం పెద్దలు అన్ని విషయాలలో తోడుగా వుంటూ సహకరిస్తున్నందులకు ధన్యవాదములు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, పడమటి శాంతకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, మునిని వీరయ్య, అప్పం వీరయ్య, తాడూరు సత్యనారాయణ, బొలుసాని సత్యనారాయణ సభ్యులు పాలుగోని దాతకు ధాన్యవాదములు తెలియజేసినారు.



# బయట మాత్రం బీభత్సం

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ ముద్దుగుమ్మ మంచి ఫ్యాన్ బేస్ ఉంది. చూడచక్కని రూపం.. అమాయకమైన నటనతో కట్టిపడేస్తుంది. ఆ బ్యూటీ మరెవరో కాదు. గుండెనిండా గుడిగంటలు సీరియల్ మీనా అలియాస్ అమూల్య గౌడ. ఈ సీరియల్ ద్వారా తెలుగు అడియన్స్ మదిలో మీనా గా చెరగని స్థానం సంపాదించుకుంది. ఈ భామను అందరూ ముద్దుగా పూలగంప అని పిలుచుకుంటారు. సీరియల్లో నిత్యం చీరకట్టులో సింపుల్ గా కనిపించే మీనా.. బయట మాత్రం చాలా ట్రెండిగా కనిపిస్తుంది. సీరియల్లో చక్కగా చీర, తల్లో మల్లెపూలు పెట్టుకుని కనిపించే అమూల్య.. నెట్టింట అందాలు ఆరబోస్తూ గ్లామర్ ఫోజులతో అరాచకం సృష్టిస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు ఫోటోస్ చూసి షాకవుతున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం అమూల్య గౌడ ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. నిత్యం చీరకట్టులో కనిపించే పూలగంప.. ఇప్పుడు గ్లామర్ ఫోజులతో నెట్టింట అగ్గి రాజేస్తుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగులో ఈ కన్నడ బ్యూటీకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.



# 64ఏళ్ల హీరోతో 27ఏళ్ల కుర్ర హీరోయిన్ రొమాన్స్

ప్రస్తుతం ఇండస్ట్రీలో కుర్ర హీరోలే కాదు సీనియర్ హీరోలు కూడా వరుస సినిమాలతో దుసుకుపోతున్నారు. అంతే కాదు భారీ హిట్స్ కూడా సొంతం చేసుకుంటున్నారు. ఇప్పటికే మన సీనియర్ హీరోలు వెంకటేష్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున హిట్స్ అందుకుంటూ కుర్ర హీరోలకు గట్టిపోటీ ఇస్తున్నారు. అంతే కాదు సీనియర్ హీరోలతో జతకట్టడానికి కుర్ర హీరోయిన్స్ కూడా వెనకడుగు వేయడం లేదు. ఇప్పటికే చాలా మంది కుర్ర హీరోయిన్స్ సీనియర్ హీరోలతో నటించి హిట్స్ అందుకున్నారు కూడా.. కొంతమంది కూతురు వయసున్న హీరోయిన్స్ తోనూ సినిమాలు చేసి హిట్స్ అందుకున్నారు. సినిమా అనేది వినోదం కోసమే.. సినిమాల్లో వయసును చూడరు. ఇటీవల సికిందర్ సినిమాల సల్మాన్ ఖాన్ సరసన రష్మిక నటించడంపై ఏజే డిఫరెన్స్ అంటూ ట్రోల్స్ జరిగాయి. దీంతో విమర్శలపై గట్టిగానే స్పందించారు సల్మాన్. కానీ గతంలో 64 ఏళ్ల స్టార్ హీరో సరసన 27 ఏళ్ల హీరోయిన్ నటించిన సినిమా భారీ డిజాస్టర్ అయ్యింది. ఇంతకీ ఆ సినిమా ఏదో తెలుసా.? నటీనటులు ఎవరో తెలుసుకుందామా. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరో హీరోయిన్స్ ఎవరో కాదండి. సూపర్ స్టార్ రజినీకాంత్.. హీరోయిన్ సోనాక్షి సిన్హా. వీరిద్దరి కాంబోలో వచ్చిన సినిమా లింగా. డైరెక్టర్ కె. ఎస్ రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2014లో విడుదలై డిజాస్టర్ అందుకుంది. ఇందులో రజనీ కాంత్ ద్విపాత్రాభినయం చేశారు. ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా, అనుష్క శెట్టి ప్రధాన పాత్రలు పోషించారు. అయితే ఈ సినిమా సమయంలో రజినీ వయసు 64 సంవత్సరాలు.. కాగా.. సోనాక్షి వయసు కేవలం 27 సంవత్సరాలు కావడం గమనార్హం. అయినప్పటికీ వీరిద్దరి జోడి తెరపై ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ సినిమాకు మాత్రం నెగిటివ్ టాక్ వచ్చింది. తమిళ్ లో పర్లేదు అనిపించుకున్నా.. తెలుగులో ఫ్లాప్ టాక్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం రజినీకాంత్ వయసు 75 సంవత్సరాలు. ఇప్పటికీ బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరిస్తున్నారు. చివరగా కూలీ చిత్రంలో కనిపించారు. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలకపాత్రలు పోషించారు. రూ.350 కోట్లతో నిర్మించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. మరోవైపు ఇప్పుడు జైలర్ 2 చిత్రీకరణంలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి నెల్సన్ దర్శకత్వం వహిస్తున్నారు.

# డ్రాగన్ కోసం కసరత్తులు



'రాఖీ' సినిమా వరకూ చాలా లావుగా ఉండేవారు తారక్. రాజమౌళి 'యమదొంగ'తో ఊహించని విధంగా స్లిమ్ అయ్యి, ప్రేక్షకులందరికీ స్వీట్ షాక్ ఇచ్చారు. ఇక అప్పట్నుంచీ మళ్లీ బరువు పెరగకుండా జాగ్రత్త పడుతూ అందంగా మారారాయన. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు తారక్. ఈ సినిమా కోసం ఆయన మరింత తగ్గారు. ఆ మధ్య ఎయిర్‌పోర్టుల్లో, యాడ్ ఫిల్మ్‌స్‌లో చిక్కిన ఎన్టీఆర్‌ని చూసి, అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం షాక్ అయ్యారు. ఈ లుక్‌పై ఆశ్చర్యం, ఆందోళన రెండూ వ్యక్తం చేశారు. అయితే.. ఇది పాత్రకోసం చేసిన ప్రణాళికాబద్ధమైన మార్పేనని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హై వోల్టేజ్ యాక్షన్ డ్రామా కోసం పాత్రకు తగ్గట్టు ఫిజిక్ కావాలని దర్శకుడు కోరడంతో... రోజుకు సుమారు 90 నిమిషాల పాటు ఫంక్షనల్ ట్రైనింగ్ చేస్తూ, కంట్రోల్ డైత్‌తో కేవలం 7వారాల్లో పది కేజీల బరువు తగ్గారట తారక్. ఈ విషయాన్ని ఆయన ట్రైనింగ్ టీమ్ వెల్లడించింది. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానున్న విషయం విదితమే.

# జీవితాన్ని కళ్లకుకట్టే బయోపిక్ ఇది

మహారాష్ట్ర మహోన్నత జానపద కళాకారిణి, దేశభక్తురాలు విఠాబాయి భౌమాంగ్ నారాయణగాంకర్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న బాలీవుడ్ పానిండియా చిత్రం 'విఠా'. ఇందులో విఠాబాయిగా శ్రద్ధాకపూర్ కనిపించనున్న విషయం తెలిసిందే. మరాఠీ దర్శకుడు సంజయ్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని లోక్‌మాన్య ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది. ఇదిలావుంటే.. విఠాబాయి పాత్ర గొప్పదనం గురించి ఇటీవల శ్రద్ధాదాస్ మాట్లాడుతూ 'పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి పాత్రలు దక్కవు. ఈ విషయంలో నేనెంతో ఆనందిస్తున్నా, గర్విస్తున్నా. విఠాబాయి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత ఒక నటిగా నాకు ఇంతకు మించిన ఛాలెంజ్ మరొకటి లేదని అర్థమైంది. కళను ఓ తపస్సుగా, వేదికను ఓ దేవాలయంలా భావించిన గొప్ప కళాకారిణి విఠాబాయి. స్టేజ్‌పై ప్రదర్శన ఇస్తుండగా ప్రసవవేదన మొదలైతే.. ఏమాత్రం తడబడకుండా, వేదిక వెనక్కు వెళ్లి, ఓ బిడ్డకు జన్మనిచ్చి, సర్జికల్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రాతితో బొడ్డు పేగును కోసి, బిడ్డను భద్రం చేసి, ఆ వెంటనే ఏమీ జరగనట్టుగానే తిరిగొచ్చి, మిగిలిన ప్రదర్శనను పూర్తిచేసిన గొప్ప కళాకారిణి విఠాబాయి. భారత్‌చైనా యుద్ధ సమయంలో ఆమె కళారూపాలు జనంలో దేశభక్తిని పురిగొల్పాయి. యుద్ధభూమిలో అలసిన సైనికులకు విఠాబాయి ప్రదర్శనలు మానసిక ఉల్లాసాన్నిచ్చాయి. జానపద కళల్ని బతికించడం కోసం ఆమె పడ్డ తపన, ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వివక్ష ఇవన్నీ ఈ బయోపిక్ కళ్లకు కడుతుంది' అని తెలిపింది శ్రద్ధాకపూర్.



# రామ్ చరణ్ ప్రశంసలతో 'ధురంధర్ 2'కు బూస్ట్..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం గ్లోబల్ స్టార్‌గా తన ఇమేజ్‌ను మరింత విస్తరించుకుంటూ దూసుకెళ్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు చేసే ప్రతి సినిమా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారుతోంది. అయితే, చరణ్ కేవలం తన సినిమాలకే పరిమితం కాకుండా, ఇతర నటీనటుల ప్రాజెక్టులను కూడా ప్రోత్సహించడంలో ముందుండటం ప్రత్యేకం. తాజాగా విడుదలైన యాక్షన్ ఎంటర్టైనర్ 'ధురంధర్ 2'పై చరణ్ స్పందించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చూసిన తర్వాత ఆయన తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, చిత్రంలోని మేకింగ్ వాల్యూస్, విజువల్ గ్రాండియర్, అలాగే నటీనటుల పెర్ఫార్మెన్స్‌ను ప్రశంసించారు. ముఖ్యంగా దర్శకుడు ఆదిత్య ధర్ టేకింగ్‌ను మెచ్చుకుంటూ, కథను హ్యాండిల్ చేసిన విధానం చాలా ఇంప్రెసివ్‌గా ఉందని పేర్కొన్నారు.చరణ్ లాంటి స్టార్ హీరో నుండి వచ్చిన ఈ ప్రశంసలు 'ధురంధర్ 2' టీమ్‌కు భారీ ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఆయన పోస్ట్‌కు స్పందించిన ఆదిత్య ధర్ కూడా ఎంతో వినయంగా ధన్యవాదాలు తెలుపుతూ, చరణ్ మాటలు తనకు ఎంతో ప్రేరణగా నిలిచాయని చెప్పారు. ఈ సోషల్ మీడియా సంభాషణతో టాలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇదిలా ఉంటే, రామ్ చరణ్‌ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ రావచ్చనే వార్తలు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తున్నాయి. 'ఉరి: ద సర్జికల్ స్ట్రైక్'తో సంచలన విజయం సాధించిన ఆదిత్య ధర్, చరణ్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక పవర్‌ఫుల్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ కాంబో సెట్ అయితే, అది పాన్‌ఇండియా స్థాయిలోనే కాదు, గ్లోబల్ మార్కెట్‌లో కూడా సంచలనం సృష్టించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
అయితే, ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సనాతో తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుని, ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతోంది. మొత్తంగా చూస్తే, చరణ్ ప్రశంసలు 'ధురంధర్ 2' సినిమాకు అదనపు హైప్ తీసుకురాగా, ఆదిత్య ధర్‌తో కాంబినేషన్ వార్తలు అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి. ఒకవేళ ఈ క్రేజీ కాంబో నిజమైతే, ఇండియన్ బాక్సాఫీస్ వద్ద మరో బిగ్ వండర్ నమోదవడం ఖాయం అనే భావన సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**